కథ

# హౌస్ వైఫ్

– డి. పద్మజ

అలారం మోతకి నాకు మెలకువ వచ్చింది. దాని నెత్తిన ఓ మొట్టు మొట్టగానే అది నోరు మూసుకుంది. ఆ చప్పుడికి శ్రీవారు ఓ సారి కళ్ళు తెరచి నా వంక చూసి మళ్ళీ నిద్రలోకి జారి పోయారు. కాని కమల లేచి కూర్చుంది. నాలుగేళ్ళ మా ఆఖరమ్మాయి ఇంట్లో అందరి కన్నా ముందు లేస్తుంది. రాత్రి ఎనిమికే నిద్ర పోతుంది.

దాన్ని పడుకోబెట్టి చిచ్చి కొట్టాను. అది మళ్ళీ నిద్ర పోయాక లేచి నిశ్శబ్దంగా మంచం దిగాను, బ్రషింగ్ చేసుకుని కాఫీ కలుపుకుని తాగుతూండగా పేపర్ వచ్చింది. రాజకీయాల మీద నాకు ఆసక్తి తక్కువ. ఉద్యోగావకాశాలకోసం ఇది వరకు పేపర్లు చూసేదాన్ని. ఉద్యోగం రావడంతో గత వారం రోజులుగా పేపర్ని తిరగెయ్యడం లేదు.

పిల్లలకి హార్లిక్స్ కలిపి, దాన్ని ఫ్లాస్కులో పోసాను. నా మొదటి జీతంతో కొత్తగా మార్కెట్లోకి వస్తున్న కాఫీ మేకర్ని కొనాలనుకున్నాను. దాంతో మా పెద్దది హార్లిక్స్ కలపచ్చు. తొమ్మిదిదేళ్ళొస్తున్నా దానికి గ్యాస్ స్టవ్ అంటించడం రాదు. స్టవ్ జోలికి ఇంట్లో పెద్ద వాళ్ళు తప్ప చిన్న వాళ్ళు వెళ్ళ కూడదన్న నియమం పెట్టారు మా శ్రీవారు.

బ్రెడ్ని కాల్చి వాటికి అటుఇటు జామ్ రాసి డైనింగ్ టేబుల్ మీద ప్లేట్లో పెట్టి మూత మూసాను, నిన్నరాత్రే పిల్లలకి చెప్పాను, వాళ్ళకి బ్రేక్ ఫాస్ట్ ఎక్కడ ఉంటుందో. అలమర తెరచి ముగ్గురి యూని ఫారాలని డైనింగ్ టేబుల్ కుర్చీల మీద వేసాను. రమణ గాడి బెల్ట్, కమల బేడ్జ్ కనపడలేదు.

గబగబ బట్టలని కిందికి లాగి వెదికాను. బెల్ట్ దొరికింది, కాని బేడ్జ్ దొరకలేదు. మరో పదినిముషాలు వెదుకుతూ అవస్థ పడ్డాక అది దాని స్కూల్ బేగ్లో పుస్తకాల మధ్య కనిపించింది.

పెద్ద వాళ్ళిద్దరూ స్నానాలు స్వయంగా చేసుకోగలరు, కాని కమల విషయంలోనే నాకు డౌట్. అప్పటికీ నాకు అపాయింట్మెంట్ వచ్చిన వారం నించి స్నానం ఎలా చెయ్యాలో నేర్పిస్తూనే వున్నాను.

శ్రీవారికి ఉప్మా చేద్దామనుకుంటే ఆవాలు నిండుకున్నాయని తెలిసింది. వెల్లుల్లి కూడా అయిపోయి వారం దాటుతోంది. నూనె ఇంకా రెండురోజులకు మించి రాదు. అవి మూడూ తీసుకురమ్మని చీటీ మీద రాసి శ్రీవారి టూత్బ్రష్కి గుచ్చాను.

గడియారం ఎనిమిది కొట్టింది. అరున్నరకి లేస్తే అప్పుడే ఎనిమిదైందా? ఇంకో అరగంటలో మా కాలని నించి బయలుదేరే బస్ ఎక్కాలి, అది మిస్ అయితే ఎర్రగడ్డ దాకా నడవాలి; కిలోమీటరున్న దూరం.


బాత్రూంలోకి వెళ్ళి షేంపూతో జుట్టు వాష్ చేసుకున్నాను, తలారా స్నానం చేసి బట్టల బీరువా ముందుకెళ్ళాను.

ఏం వేసుకెళ్ళాలి?

బయటకి వెళ్ళేప్పుడల్లా నాకిదో పెద్ద సమస్య. మొదటి రోజే పంజాబి డ్రస్ బాగోదు. నాలుగైదు రోజులు చీరల్లో చూసాక పంజాబి డ్రస్ వేసుకోవాలి.

ఏం చీర? షిఫానా? కాటనా? ప్యూర్ సిల్కా? మైసూర్ సిల్కా? టస్సర్ చీరా? చివరికి కాశ్మీర్ సిల్క్ చీరని ఎన్నుకున్నాను.

కమల నిద్ర లేచింది. రమణని, పెదపాపని నిద్ర లెమ్మని అరిచి పౌడర్ అందుకున్నాను. నా మొహానికి



మేకప్ చేసుకోడానికి అయిదు నిముషాలు పట్టింది. నా చిన్నప్పుడు ఇంత టైం తీసుకునే వాళ్ళం కాదు. ఇన్ని మేకప్ ఐటమ్స్ కూడా అప్పట్లో దొరికేవి కావు.

రమణగాడు పళ్ళుతోముకుని ఆకలన్నాడు. టేబుల్ మీద వుంది చూడమన్నాను. నన్నే పెట్టమన్నాడు.

"పెట్టుకుతిను, పౌడర్ వాసనేస్తుంది" కోప్పడ్డాను,

"నాకు బ్రెడ్ వద్దు. కార్న్ ఫ్లేక్స్ కావాలి" అరిచాడు.

"తింటే తిను. లేదా మాడు" బదులుగా విసుగ్గా అరిచాను.

డిసిప్లిన్ ముఖ్యం అంటారు మా వారు.

హేండ్ బేగ్లో ఏం వున్నాయి, ఏం లేవు చూసుకుంటూండగా శ్రీవారు మంచం దిగి పేపర్ పట్టుకుని ముందు గదిలో కూర్చున్నారు.

"స్కూటర్ మీద డ్రాప్ చెయ్యాలా?" అడిగారాయన ఆవులిస్తూ. "అక్కర్లేదు కాని, పిల్లలు స్నానాలు చేశాక స్కూల్ దగ్గర దింపండి చాలు". రెండు టిఫిన్ బాక్సుల్లో ఉప్మా సర్ది ఒకటి నా హేండ్ బేగ్లో వుంచుకున్నాను. ఇంకోటి మా వారు ఆఫీస్కి తీసుకెళ్ళే బేగ్లో వుంచాను. రమణగాడు మళ్ళీ పక్క మీదకి చేరి నిద్ర పోతున్నాడు. వాడ్ని అదిలించి లేపాను.

"ఆకలి. నాకు కార్న్ ఫ్లేక్స్ కావాలి" అన్నాడు.

"రేపు కార్న్ఫ్లేక్స్ చేస్తాలే కానీ ఇవాళ్టికి బ్రెడ్ జామ్ తిను"

"ఉహూ".

"నాకు మండుకొచ్చేలా చెయ్యకు. పోనీ సాస్ కూడా ఇవ్వనా? అది నంచుకుంటావా?" లంచం ఆఫర్ చేసాను.

బ్రెడ్కి జామ్ అండ్ సాస్ మా ఇంట్లో సిద్ధం. ఏదో ఒకటే ఛాయిస్. నన్నేదో ఉద్ధరిస్తున్నట్లుగా వప్పుకున్నాడు. పరిస్థితి గమనించి కమల కూడా కార్న్ ఫ్లేక్స్ కావాలంది. సాస్ సీసాని టేబుల్ మీద ఉంచాను.

ఇంక సరిగ్గా అయిదు నిముషాలుంది, బస్కి. పెద పాపకి రాత్రి ఇచ్చిన ఇన్స్ట్రక్షన్స్ మళ్ళీ మరోసారి ఇచ్చాను. ఇంటి డూప్లికేట్ కీ హేండ్ బేగ్లో వుంచుకున్నాను. శ్రీవారి జేబులోంచి చిల్లర తీసాను. బయట నించే, గేస్ వాడికి ఫోన్ చేయమని గావుకేక పెట్టాను.

గబగబ బస్ స్టాప్ వైపు నడిచాను. దూరం నించే బస్ కనపడింది. వేగం పెంచాను. ఆడిటర్ వీరభద్రరావు, సెక్షన్ఆఫీసర్ ఈశ్వర్ ప్రసాద్, అకౌంట్స్ ఆఫీసర్ బాలకృష్ణ, ఇంకా సత్తిరెడ్డి, పూర్ణచంద్రరావు, మిసెస్ పూర్ణిమ... వాళ్ళందరిలా నేనూ ఆఫీస్కి వెళ్తున్నాను. ఎంతో గర్వంగా అనిపించింది నాకు.

వెళ్ళి బస్లో కూర్చున్నాను. కండక్టర్, డ్రైవర్ ఇంకా రాలేదు, చాలా మంది మగాళ్ళు బస్ ఎక్కకుండా కిందే నిలబడి కబుర్లాడుకుంటున్నారు.

మిసెస్ పూర్ణిమ నన్ను చూసి నవ్వి అడిగింది.

"ఇవాళ్టి నించేనా ఉద్యోగం?"

"అవునండి" గర్వంగా చెప్పాను.

హైరాన పడి వచ్చాను కాని, కండక్టర్ పదినిముషాలు లేట్గా బయదేరారు. నేను లేట్గా వస్తే ముందే వెళ్ళి పోయి వుండేది, లక్డీకాపూల్కి టిక్కెట్ తీసుకున్నాను. నేనెక్కడికి వెళ్ళాలో తెలుసుకున్నాక బస్పాస్ తీసుకోండని పూర్ణిమ సలహా ఇచ్చింది.

దానికి మళ్ళీ ఫోటోలు తీయించుకోవాలి.

బస్ తొమ్మిదీ పదికి లకడీకాపూల్ చేరుకుంది. దిగిన వాళ్ళలో ఎక్కువమంది ఏజి ఆఫీస్లోకి వెళ్ళారు. నేను ఇంకో బస్ కోసం వెయిట్ చేయసాగాను.

ఆర్నెల్లుగా పోరాడి, శ్రీవారిని వప్పించి, ఉద్యోగం చేయాలన్న నాకోరికని ఈ రోజునుంచి తీర్చుకుంటున్నాను. నాకు ఎంతో ఆనందంగా వుంది. రెండు బస్లు వచ్చాయి కాని అవి నే వెళ్ళే రూట్వి కాదు. క్రమంగా బస్స్టాప్లో రష్ పెరగసాగింది.

నా రూట్ బస్లు రెండు వచ్చాయి కాని, తోసుకు

ఎక్కడం చేత కాక నిస్సహాయంగా నిల్చుని చూస్తూండి పోయాను. మూడోబస్‌లో రద్దీ లేకపోయినా, స్టాప్‌లో ఆగలేదు. దూరంగా ఆగింది, అందరితో పాటు నేనూ దాని దగ్గరకి పరిగెత్తా. కాని మేం దాన్ని అందుకునే లోగానే అది కదిలి వెళ్ళిపోయింది. ఈలోగా ఇంకో బస్ వచ్చి నిజాయితీగా స్టాప్‌లో ఆగింది. అయితే మేం పరిగెత్తుకు వస్తున్నా, మాకోసం అది నిజాయితీగా ఆగలేదు. అలా రెండు బస్సులు మిస్ అయ్యాను.

తర్వాత బస్ ఎక్కాను.

రాణి గంజ్ చేరకుండానే పెద్ద చప్పుడు చేస్తూ టేంక్ బండ్ మీద ఆగిపోయిందది. డ్రైవర్ కిందకి దిగి చూసి, అది తీసి చూసి, ఇది లాగి చూసాడు. కొందరు మగాళ్ళు తోసారు కానీ అది మళ్ళీ స్టార్ట్ కాలేదు.

బస్ చెడిపోయిందని చెప్పాడు డ్రైవర్. నా రిస్ట్‌వాచ్‌లో టైం అప్పటికే పది ముప్పై అయిదు చూపిస్తోంది.

ఇంకో బస్ ఆగింది. అంతా కండక్టర్ సంతకాన్ని తమ టిక్కెట్ల వెనకాల తీసుకుని పోలోమంటూ దాన్లోకి జొరబడ్డారు.

నేను నా టిక్కెట్ చింపేసాను. ఆటోని ఆపి ఏ. జి కాలనీకి వస్తావా అని అడిగాను. అదెక్కి కూర్చుని ఇంటికి చేరుకునే సరికి పదకొండూ అయిదు.

నేనింట్లోకి వెళ్ళేసరికి రమణ, పెదపాప క్రికెట్ ఆడుకుంటున్నారు, ఐబ్రో పెన్సిల్‌తో గోడ మీద ఏ.బి.సి.డిలు రాస్తూ కమల టీచర్ ఆట ఆడుతోంది.

"స్కూల్ కెళ్ళ లేదేం?" అడిగాను.

"నా బేడ్జ్ లేకపోతే స్కూల్‌కి రానివ్వరు కదా?" చెప్పాడు రమణ.

"నీ బేడ్జ్ నిన్న ఎక్కడ పెట్టుకున్నావ్?"

"ఏమో మరి"

"పెదపాపా, నీకేమైంది?" అడిగాను.

"వీళ్ళిద్దరికీ తోడుగా డేడీ నన్నుండమన్నారు."

వంటగదిలో కార్న్‌ఫ్లేక్స్ సీసా తిరగబడి వుంది. పాలు కిచెన్ ప్లాట్ ఫాం మీద ధార కట్టి వున్నాయి. చక్కెర సీసా సగానికి పైగా గంటన్నరలో ఖర్చయింది. నేను శ్రీవారికి రాసి బ్రష్‌కి గుచ్చిన కాగితం, బాత్‌రూంలో నేలమీద పడివుంది. పక్కనే సాస్ సీసానేల మీద దొర్లుతోంది.

హైహీల్ షూస్ విప్పిఇంట్లోవాడే హవాయి చెప్పులు తొడుక్కున్నాను. కాశ్మీర్ సిల్క్ చీర విప్పి మామూలుది కట్టుకున్నాను. దిద్దుకున్న ఐబ్రోలని తుడిపేసుకున్నాను. మొహం పౌడర్‌ని, చెంపలకి రాసుకున్న రోజ్‌కలర్‌ని కడిగేసుకున్నాను.

తల్లిగా, ఉద్యోగస్తురాలిగా ఒకే జీవితంలో ఉండటం అసాధ్యం అని తెలిగానే నాకు ఏడుపు రాలేదు.

కొంగు దోపుకుని స్పాంజ్‌ని అందుకుని వంట గదిలోకి నడిచాను. ఉద్యోగంలో చేరనందుకు నాకు కించిత్ కూడా బాధ లేదు, ఇంటికి తిరిగి వచ్చినందు నాకు ఎంతో సంతోషంగా వుంది.

కుటుంబభారం, ఉద్యోగం చేసే మోయనవసరం లేని నాకు కెరీర్ వుమన్‌గా వుండే కంటే హౌస్ వైఫ్‌గా వుండటంలోనే నిజమయిన తృప్తి అన్న నిజం తెలుసుకున్న ఆ క్షణం నా కెంతో విలువైంది.

## తీరిక వేళల్లో...

# విసనకర్ర చేయడం ఎలా?

ఎండాకాలం అనగానే ఎండ, చెమట గుర్తొస్తాయి. ఎంత ఫాన్లు కూలర్లు వున్నా పవర్ లేకపోతే చెమటకు విసనకర్ర చేతిలోకి రాక తప్పదు. అంత అత్యవసరమైన విసనకర్రను మనమే తేలికలో సులభంగా తయారు చేసుకుని దానితో విసురుకుంటే ఆ గాలిలోని చల్లదనమే వేరు. ఇప్పుడు చీపురు పుల్లలతో విసనకర్ర ఎలా చేయాలో చూద్దాం.

కావలసినవస్తువులు:-

చీపురు కట్ట ఒకటి.


డై రంగులు రెండు,

ఒక తెల్లదారపువుండ.

చీపురు పుల్లలని ఈనె పుల్లలని అంటాము. సన్నగా చివర ముళ్ళుండి లేత పసుపు రంగులో వుండే చీపుర్లు అందరికీ తెలిసినవే. వాటిలో ఒకేలావుండే పుల్లలను ఏరుకోవాలి. విసనకర్ర సైజును బట్టి పుల్లలపొడవు నిర్ణయించుకోవాలి. సాధారణంగా 9 అంగుళాల పొడవు పుల్లలు వంద తీసుకోవాలి. డైకలర్ పొడిని మరుగుతున్న నీళ్ళలో వేసి కలవగానే దింపి కాస్త చల్లారనిచ్చి పుల్లలను అందులో వేయాలి. పుల్లలకు రంగు వస్తుంది. రెండు కలర్స్ తీసుకొని సగం ఒక రంగు రెండవసగం రెండవరంగు వెయ్యాలి. మొదట 6 ఆకుపచ్చపుల్లలు అటుఇటు ఒక్కొక్క తెల్లపుల్ల పెట్టుకొని దాని అడుగున ఇదేవిధంగా ఎరుపు పుల్లలు ఆరు అటు ఇటు తెల్లపుల్లలు వేసుకోవాలి.

ఒక పుల్లకు తెల్ల దారం కొస ముడివేసి + ఆకారంలో ఉన్నపుల్లలలో ఒక దాని మీదనుండి వేరొక దాని క్రిందనుండి దారం తీస్తూ పుల్లలు గట్టిగా బిగిసేలా చేయాలి. ఏ రెండు రంగులైనా తీసికోవచ్చు. ఈ క్రింది బొమ్మలో చూపినట్లు, నల్ల చుక్కలు దారం అన్నమాట. తరువాత అటుఇటు తెల్లపుల్ల పెడుతూ 9 రంగుపుల్లలు ఒక్కొక్కటే అడ్డంగా పెడుతూ దారం దానిమీది నుండి చుడుతూ వెయ్యాలి. అడ్డ పుల్లలు పెట్టినప్పుడు రెండు సార్లు దగ్గరగా దారం చుడితే ఒక డిజైన్‌లాగా దారం వస్తుంది. మరల రెండవరంగు పుల్లలను నిలువులో తొమ్మిది, రెండు మామూలుపుల్లలు వచ్చేట్టు అల్లుతూ పెట్టాలి.

ఫోటోలో చూస్తే పుల్లల అమరిక తెలుస్తుంది. ఈ విధంగా విసనకర్ర 9 అంగుళాల చదరం తయారవు తుంది. ఇప్పుడు మూడు ప్రక్కలా మనకి



ఇష్టమైన రంగు గుడ్డ తీసుకొని కుచ్చులు పెట్టి పుల్లలు కనబడకుండా చాప అంచులు కుట్టి నట్టు కుట్టాలి. మూడు వైపులాఈ విధంగా కుట్టి నాల్గవవైపున 12 అంగుళాల లావు వెదురు పుల్లను పెట్టి దాన్ని వూడకుండా బట్టతో కుట్టేయాలి. విసనకర్ర పట్టుకునే చోట 3 అంగుళాల గొట్టంలాటి వెదురును ఈ పుల్లకు దూర్చి అది పడిపోకుండా పుల్ల చివర గుండ్రంగా బట్ట చుట్టి అందంగా కుట్టాలి.

ఈ విధంగా మనమే తయారు చేసుకున్న విసనకర్ర తక్కువ ఖర్చులో చూడముచ్చటగా వుంటుంది.

ఒక్క రోజులో సులభంగా అల్లు కోవచ్చు. ఎటొచ్చి దారం చుట్టేటప్పుడు ఒక్కొక్క పుల్లా పెట్టి కదలకుండా గట్టిగా చుట్టాలి. చేసి చూస్తారు కదూ.

- జి. ఇందిరామూర్తి

